# ట్రాట్స్కీ రాజకీయ జీవితం

ట్రాట్స్కీ తనని తాను "నిజమైన బోల్షివిక్-లెనినిస్ట్" అని చెప్పుకుంటాడు. అదేవిధంగా జర్మను విప్లవానికి ఉరితాడు బిగించిన సోషల్ డెమోక్రాట్లు నోస్కే, స్చెఇదెమన్న, సెవెరింగ్ లు తమని తాము "నిజమైన మార్క్సిస్టులము" అని చెప్పుకున్నారు. లెనిన్ సాంప్రదాయాన్ని ముందుకు తీసుకు వెళ్ళిన గొప్ప విప్లవకారులలో చివరి వ్యక్తిగా ట్రాట్స్కీ నటిస్తాడు. అతన్ని "పాత బోల్షివిక్"గా భావించే ప్రజానీకం, ప్రత్యేకించి యువతరం, ఉంది. అతను 1917 విప్లవ నాయకుడు కాదా? 1918 -1921ల మధ్య అతను ఎర్ర సైన్యానికి నాయకత్వం వహించలేదా? అని వారు అంటారు.

వాస్తవాలు ఇవి:

ట్రాట్స్కీ 20వ శతాబ్దం ప్రారంభంలో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. 1903లో మెన్షివిక్కులకూ బోల్షివిక్కులకూ మధ్య ఏర్పడిన అగాధం ఒక స్పష్టమైన రూపం తీసుకున్నప్పుడు, ట్రాట్స్కీ మెన్షివిక్కులతో చేరాడు. ఏదో ఒక రూపంలో 1917 వేసవి చివర వరకూ బోల్షివిజంతో పోరాడాడు. బోల్షివిక్ కార్యక్రమం లోని ఏదో అంశంతో అతను ఏకీభవించేవాడు, కానీ వెంటనే బోల్షివిక్కులతోనూ లెనిన్ తోనూ పోరాడటానికి మెన్షివిక్కులతో కలిసేవాడు. అతను 1923 లో బోల్షివిజంపై తన బహిరంగ శతృత్వాన్ని పునరుద్ధరించాడు, అప్పటి నుండి బోల్షివిజంతో పోరాడుతూనే ఉన్నాడు.

అతను విప్లవ నాయకుడు ఎట్లా అయ్యాడు? కార్మిక సంస్థల నిర్మాతగా కార్మికుల కష్ట జీవితాల మధ్య అతను ఎప్పుడూ పని చెయ్యలేదు. అతను ఎన్నడూ కార్మికులలో గణనీయమైన సంఖ్యను తానున్న వైపు తిప్పుకో లేకపోయాడు. అతను ఎప్పుడూ ఒక

వక్త, రచయిత గానే మిగిలిపోయాడు. వక్తగా, రచయితగా పెట్టీ బూర్జువా మేధావులలో గొప్ప ఆదరణ సంపాదించుకున్నాడు . రష్యాలో విప్లవ కార్మికవర్గం శైశవదశలో ఉన్నప్పుడు, పదునైన కలం, వక్తృత్వ ప్రతిభ ఉన్న ట్రాట్స్కీ వంటి వ్యక్తి చాలా సులభంగా గుర్తింపు పొందుతాడు. ఈ లక్షణాల కారణంగానే 1905లో జరిగిన విప్లవంలో ఏర్పడిన మొదటి కార్మిక డిప్యూటీల సోవియట్ లో సభ్యుడయ్యాడు. ఆ కాలపు సోవియట్, లెనిన్ మాటల్లోచెప్పాలంటే , "ఒక నిశ్చితమైన రూపం లేని, విశాల సోషలిస్టుల, రివల్యూషనరీ డెమొక్రాట్ల పోరాట యూనియన్." సోవియట్ యొక్క మొదటి అధ్యక్షుడు కృస్తాలేవ్-నోసార్ కనీసం సోషలిస్టు కూడా కాదు. కృస్తాలేవ్-నోసార్ అరెస్టు తరువాత ట్రాట్స్కీ చైర్మన్ అయ్యాడు. 1905 విప్లవంలో అతని పాత్ర గురించి ప్రముఖ చరిత్రకారుడు పోక్రోవస్కీ ఇలా చెప్పాడు, "పీటర్స్ బర్గ్ సోవియట్ పని చేసినంతకాలం ఆ సోవియట్ నాయకత్వంలో చాలా తెలివైన మెన్షవిక్ ఉన్నాడు. అతను విప్లవ పదజాలంతో మెన్షివిక్ భావజాల సారాన్ని కలిపివేసే కళను సాధన చేసినవాడు. ఆ మెన్షివిక్ పేరు ట్రాట్స్కీ. అతను నూటికి నూరు పాళ్ళు మెన్షివిక్. సాయుధ తిరుగుబాటు చెయ్యాలనే కోరిక అతనికి ఏ మాత్రం లేదు, సాయుధ విప్లవాన్ని విజయవంతంగా ముగించడానికి, అంటే జారు పాలనను కూలదోయడానికి, అతను విముఖుడు." *(M. N. Pokrovsky, Brief History of Russia, Vol. II. p. 320).*

1906 తరువాత ఆస్ట్రియాలోని వియన్నాలో ఒక చిన్న కేంద్రాన్ని స్థాపించి, అక్కడి నుండి తన స్వంత పత్రికను ప్రచురించడం ప్రారంభించాడు. వివిధ స్థాయిలలో ఆ పత్రిక ద్వారా బోల్షివిజానికి వ్యతిరేకంగా పోరాడాడు. 1912లో ఆగస్టు కూటమి అని పిలవబడే బోల్షివిక్ వ్యతిరేక కూటమిలో అతను చేరాడు. బోల్షివిజంపై అతను నీతి నిజాయితీ లేకుండా తీవ్రంగా దాడి చేశాడు. ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో అతను మధ్యేవాదాన్ని ఆశ్రయించాడు.

లెనిన్ చెప్పినట్లు, ఒక సామ్రాజ్యవాద దొంగల ముఠాకు వ్యతిరేకంగా మరొక సామ్రాజ్యవాద దొంగల ముఠాతో సహకరించడానికి  తమ కేపిటలిస్టు ప్రభుత్వాలతో చేతులు కలిపిన  సోషల్ డెమోక్రాట్లను అతను మాటలలో వ్యతిరేకించాడు. వాస్తవానికి అతను వారితో తెగతెంపులు చేసుకోలేదు. తరచుగా  అతను వారిని సమర్థిస్తూ మాట్లాడేవాడు.  అతను యుద్ధానికి వ్యతిరేకి, అదే సందర్భంలో అతను లెనిన్ ను కూడా వ్యతిరేకించేవాడు. యుద్ధ సమయంలో "తమ  స్వంత ప్రభుత్వమే కూలిపోయేలా కృషి చెయ్యమని  లెనిన్ కార్యక్రమం కార్మికులకు పిలుపునిచ్చింది. ప్రతి దేశంలోనూ ఈ సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా, అంటే బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా విప్లవంగా మార్చమని చెప్పింది. అన్ని నిజమైన విప్లవ సోషలిస్టు శక్తుల కొత్త అంతర్జాతీయ సంస్థను ఒకదానిని ఏర్పాటు చెయ్యాలని పిలుపునిచ్చింది.  ట్రాట్స్కీ ఈ లెనినిస్టు  నినాదాలను వ్యతిరేకించాడు.  మన స్వంత  ప్రభుత్వం యుద్ధంలో ఓడిపోవడం విప్లవానికి మంచిదని లెనిన్ చెప్పగా, దీనిని సామాజిక – దేశ భక్తి యొక్క రాజకీయ పద్ధతులకు ఇది రాయితీ (a concession to the political methods of social-patriotism) అని ట్రాట్స్కీ అన్నాడు. 1915లో స్విట్జర్లాండ్ లోని జిమ్మెర్వాల్డ్ లో సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా పోరాటాన్ని నిర్వహించడానికి విప్లవ సోషలిస్టులు సమావేశమైనప్పుడు,  ట్రాట్స్కీ లెనినిస్టు వామపక్షంతో కాక మధ్యేవాదులతో ఉన్నాడు.

లెనిన్ ఆలోచనలతో ట్రాట్స్కీ ఆలోచనలు ఎంత భిన్నంగా ఉన్నాయంటే, 1917 ఫిబ్రవరి విప్లవం తరువాత కూడా లెనిన్ ట్రాట్స్కీని బోల్షివిక్కుగా గుర్తించ లేదు. 1917, మార్చి 17న కొలంతాయ్ కి వ్రాసిన ఉత్తరంలో లెనిన్ ఈ విధంగా పేర్కొన్నాడు:

*“నా అభిప్రాయంలో, సామాజిక-దేశభక్తులతో (social-patriots) (లేదా, ఇంకా ప్రమాదకరమైనది ఏమిటంటే ఊగిసలాడే ట్రాట్స్కీ, మురా వంటి వారితో) ఐక్యతకోసం మూర్ఖమైన ప్రయత్నాలలో చిక్కుకోకుండా జాగ్రత్త పడడం, , అంతర్జాతీయ స్ఫూర్తితో మనపార్టీ పనిని కొనసాగించడం మన ప్రధాన కర్తవ్యం. (V. I. Lenin, The Revolution of 1917, Vol. 1, English edition, p. 21.)*

*1917, మే మధ్యలో ఒక సమావేశంలో సమర్పించడానికి తయారు చేసిన నివేదిక సారాంశంలో ‘పెట్టీ బూర్జువా ఊగిసలాటలకు వ్యతిరేకంగా శ్రామికవర్గ పంథాను రాయిలా ధృఢంగా అనుసరించాల్సిన’ అవసరం గురించి పేర్కొంటూ లెనిన్ ముఖ్యమైన ఈ వాక్యాన్ని చేర్చాడు.*

*“పెట్టీ బూర్జువా ఊగిసలాటలు: ట్రాట్స్కీ ... (V. L Lenin, Collected Works, Vol. XXX, Russian edition,. p. 331.)*

*ఫిబ్రవరి విప్లవం తరువాత విదేశాలనుండి తిరిగి వచ్చిన ట్రాట్స్కీ “ఇంటర్ బరైట్స్ (interboroughites) అనే పెట్రోగ్రాడ్ సోషల్ డెమోక్రటిక్ గ్రూపులో చేరాడు. ఈ గ్రూపు మధ్యేవాద మార్గాన్ని అనుసరించే గ్రూపు. అనేక సంవత్సరాలు పెట్రోగ్రాడ్ లో బోల్షివిక్ సంస్థతో పోరాడింది. ఫిబ్రవరి విప్లవం తరువాత కూడా సోషల్ పేట్రియాట్స్ తో సహా, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ యొక్క వివిధ గ్రూపులను ఐక్యం చెయ్యాలని ఈ గ్రూపు భావించింది. అయితే క్రమంగా వారు సోషల్ పేట్రియాట్స్ తో ఐక్యత ఆలోచనను వదలిపెట్టి, బోల్షివిక్కు విధానాలను అంగీకరించే దిశగా మరింత ఎక్కువగా మొగ్గు చూపారు.*

*ఆగస్టు నెలలో పార్టీ 6వ మహాసభ జరుగబోతున్న సమయంలో, 1917 వేసవి చివరలో “ఇంటర్బరో” గ్రూపు బోల్షివిక్కు పార్టీలో చేరింది. ఈ గ్రూపుకు కాంగ్రెస్ ప్రతినిధి వర్గంలో చోటు లభించింది. పార్టీ నూతన కేంద్ర కమిటీకు ఎన్నుకోబడిన 22మంది*

సభ్యులలోనూ ముగ్గురు - ట్రాట్స్కీ, యురిట్స్కీ, యోఫేలు – ఇంతకు ముందు ఇంటర్ బరో సభ్యులు.

బోల్షివిక్ విధానాలను ఆమోదిస్తున్నానని ప్రకటించినందున, పార్టీ, కార్మిక వర్గ ప్రయోజనాల కొరకు పనిచేయడానికి కేంద్ర కమిటీ ట్రాట్స్కీకి పూర్తి అవకాశాన్ని ఇచ్చింది. ఒక సమర్ధవంతమైన వక్తా, 1905లో మొదటి సోవియట్ చైర్మన్ కూడా అయిన ట్రాట్స్కీ 1917 ఆఖరులో పెట్రోగ్రాడ్ సోవియట్ చైర్మన్ అయ్యాడు. బోల్షివిక్ పార్టీ కేంద్ర కమిటీ ప్రత్యక్ష నిర్దేశకత్వంలో పనిచేస్తూ అక్టోబర్ విప్లవ నిర్ణయాత్మక దినాలలో ఆయన ఈ పదవిలో ఉన్నాడు.

1917 నవంబరులో బోల్షివిక్కులు అధికారాన్ని స్వాధీనం చేసుకున్న సమయంలో మిలిటరీ రివల్యూషనరీ కమిటీ సభ్యునిగా ట్రాట్స్కీ ఒక ప్రముఖ పాత్ర పోషించాడు. కాని తిరుగుబాటుకు అతనే నాయకుడనటం అర్ధం లేని మాట.

"తిరుగుబాటులో కామ్రేడ్ ట్రాట్స్కీ నిస్సందేహంగా ఒక ముఖ్యమైన పాత్రను పోషించాడు. ఇది నేను కాదనడం లేదు. (అన్నాడు స్టాలిన్ అక్టోబర్ విప్లవం పుస్తకంలో పేజీ 71]. కాని అక్టోబర్ విప్లవంలో కామ్రేడ్ ట్రాట్స్కీ ఏ విధమైన ప్రత్యేక పాత్ర పోషించలేదనీ, పోషించగల స్థితిలో లేడనీ నేను చెప్పి తీరాలి. పెట్రోగ్రాడ్ సోవియట్ అధ్యక్షునిగా పార్టీ అధికారుల నిర్ణయాలను మాత్రమే అమలు చేశాడు. ట్రాట్స్కీ యొక్క ప్రతి అడుగుకూ పార్టీ మార్గ నిర్దేశం చేసింది' (1924, నవంబరు 26న ప్రచురింపబడిన వ్యాసంలో).

తిరుగుబాటుకు సన్నాహాలు చెయ్యడానికి ఒక కేంద్రంగా, కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ అక్టోబరు 16న నియమించిన ఐదుగురు సభ్యులలోనూ ట్రాట్ స్కీ లేడు.

“ఆ విధంగా [స్టాలిన్ చెప్పాడు] ఈ కేంద్ర కమిటీ సమావేశంలో ‘భయంకరమైనది’ ఏదో జరిగింది - అంటే ‘ఏదో రహస్య పద్ధతిలో,’ విప్లవానికి ‘స్ఫూర్తి ప్రదాతా, ‘ప్రధానమైన వ్యక్తీ’, ‘ఏకైక నాయకుడూ’ అయిన కామ్రేడ్ ట్రాట్స్కీ కి తిరుగుబాటుకు నాయకత్వం వహించడానికి ఏర్పడిన ఆచరణాత్మక కేంద్రంలో స్థానం లేకుండా పోయింది. కామ్రేడ్ ట్రాట్స్కీ యొక్క ప్రత్యేక పాత్ర గురించిన ప్రస్తుతం ప్రచారంలో ఉన్న భావనతో ఇది ఎలా పొసుగుతుంది?” *(Ibid., pp. 71-72.)*

బోల్షివిక్ పార్టీ పని పద్ధతులు తెలిసినవాడెవడైనా తిరుగుబాటుకు దిశానిర్దేశం చెయ్యడానికి కేంద్ర కమిటీ నియమించిన సభ్యులలో ట్రాట్స్కీ ఎందుకు లేడో తేలికగానే అర్థం చేసుకుంటాడు. ట్రాట్ స్కీ కొత్తగా పార్టీలో చేరిన వ్యక్తి. బోల్షివిక్ పార్టీ నిర్మాణంలో అతని పాత్ర లేదు. అతను ఇటీవలి వరకు బోల్షివిక్కులతో విభేదిస్తూనే ఉన్నాడు. వాస్తవానికి అతను బోల్షివిక్ మూసలో తయారైన వ్యక్తి కాడు. అతను రష్యాలో ప్రభావం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందాడు. కానీ అతని ప్రభావం ప్రధానంగా పెట్టీ బూర్జువా వర్గానికి మాత్రమే విస్తరించింది. పార్టీ నాయకత్వం వహించాలనుకుంటున్న పెట్టీ బూర్జువా సమూహానికీ బోల్షివిక్ పార్టీకీ మధ్య ఒక విధమైన అనుసంధానకర్త లాంటివాడు అతను.

అధికారాన్ని స్వాధీనం చేసుకున్న వెంటనే లెనిన్ తో ట్రాట్స్కీ విభేధించసాగాడు.. కార్మికవర్గ విప్లవం నిలదొక్కుకుని సంఘటిత పడడానికి జర్మనీతో బ్రెస్ట్-లిటోవస్క్ ఒడంబడిక మీద సంతకం చెయ్యడం ఒక అవసరమయింది. అప్పుడు విదేశీ వ్యవహారాల కమిస్సార్ గా ఉన్న ట్రాట్స్కీ ఆ ఒడంబడికపై సంతకం చేయడానికి నిరాకరించాడు. ట్రాట్స్కీ తన మొండి పట్టును వదలి, విప్లవాన్ని కాపాడే ఈ అడుగు వేసే విధంగా ఒప్పించడానికి, లెనిన్ కున్న అద్భుతమైన సంకల్ప శక్తీ, ఒక తీవ్రమైన మందలింపూ అవసరమయ్యాయి.

కాలం గడిచింది. ట్రాట్స్కీ బోల్షివిక్కులతో కలిసి పనిచేశాడు. పైకి బోల్షివిక్కులలో ఒకడిగా కనుపించాడు. కానీ అతను బోల్షివిక్కు పార్టీతో పూర్తిగా ఐక్యం కాలేని వ్యక్తిగానే మిగిలిపోయాడు. అంతర్యుద్ధం వచ్చింది, పార్టీ ట్రాట్స్కీకి ఒక ఉన్నత పదవి ఇచ్చింది. వాస్తవానికి అతను ఎర్ర సేన ప్రాపగాండిస్టులకు నాయకుడి లాంటి వాడు. అతను సైనిక కమిస్సారే, కానీ సైన్యం గురించి తెలిసిన వాడు కాదు. సైన్య నిర్మాణం గురించి అతనికి ఏమీ తెలియదు. విప్లవ యుద్ధ వ్యూహం గురించి అతనికి తప్పుడు అవగాహన ఉంది. ఎర్ర సైన్య నిర్మాణ కార్యక్రమాన్ని దేశం మొత్తం, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో లక్షలాది కార్మికులు చేపట్టారు. నిర్వహించింది లెనిన్ నిశిత పర్యవేక్షణలో, కేంద్ర కమిటీ నియంత్రణలో ఉన్న సైనిక నిపుణుల ఆధ్వర్యంలో, అసలు యుద్ధం జరిగింది.

ట్రాట్స్కీ యుద్ధరంగమంతటా పర్యటించాడు. సైనిక శైలిలో ఉన్నాయని ఉటంకించే విధంగా ఉండే పదునైన ఆదేశాలను జారీ చేశాడు, కందకాలలోకి దిగి ఎర్ర సైనికులతో మాట్లాడాడు, అద్భుతమైన ప్రసంగాలు చేశాడు, కానీ అతనెప్పుడూ అంతర్యుద్ధానికి నాయకత్వం వహించలేదు. మహత్తరమైన ఆ చారిత్రిక పోరాటానికి తానే స్ఫూర్తి ప్రదాతనని అతను భ్రమపడి నమ్మి ఉండవచ్చు. ఆతను ఈ రోజువరకూ అలాగే నమ్ముతూ ఉండవచ్చు. కాని అసలు వాస్తవాలు సరిగ్గా దానికి విరుద్ధంగా ఉన్నాయి.* అసలు వాస్తవం ఏమిటంటే, స్పష్టమైన దూరదృష్టి గల ప్రధమ శ్రేణికి చెందిన వ్యూహకర్తలుగా గొప్ప పోరాట యోధులుగా, మొదటి శ్రేణికి చెందిన విప్లవ వ్యూహకర్తలుగా వివిధ యుద్ధ రంగాలలో స్టాలిన్, వోరోషిలోవ్ లు నిలిచారు.

* వాస్తవానికి అంతర్యుద్ధ వ్యూహం గురించిన ట్రాట్ స్కీ ఆలోచనలు ఎంత తప్పుగా ఉన్నాయంటే, అతని ఆలోచనలను అనుసరించి ఉంటే శత్రువు విజయం సాధించేవాడు. 1919 వేసవిలో ఏమి జరిగిందో ఒకసారి జ్ఞాపకం చేసుకుంటే మనకు ఇది స్పష్టమవుతుంది. తెల్ల సైన్యం జనరల్ కోల్చాక్ కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం

చాలా కీలకమైన స్థితిలో ఉన్నప్పుడు, ఎర్ర సైన్యం లోని కొంత భాగాన్ని తూర్పు రంగం నుండి దక్షిణ రంగానికి తరలించాలని ట్రాట్స్కీ ప్రతిపాదించాడు. అలా తరలిస్తే ఉరల్ ప్రాంతం లోని ఫ్యాక్టరీలు, రైల్వేలు కోల్చాక్ చేతుల్లోకి పోయేవి. కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ ట్రాట్స్కీ నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నది. ఉరల్స్ నుండి కోల్చాక్ ను తరిమి వెయ్యాలని ఆదేశించింది. దానితో కోల్చక్ అంతం ఆరంభమైంది. దానితో తూర్పు రంగంలో ట్రాట్స్కీ పాత్ర కూడా ముగిసింది. త్వరలోనే దక్షిణ రంగంలో తెల్ల సైన్యం జనరల్ దేనికిన్ కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో కూడా అతని పాత్ర ముగిసింది. విప్లవ చరిత్ర గురించి రాసిన పుస్తకంలో ట్రాట్స్కీ ఈ విషయం గురించి చెప్పడు. ట్రాట్స్కీ ని ఎంతగా విశ్వసించవచ్చునో ఇది తెలియజేస్తుంది.

అంతర్యుద్ధం ముగియక ముందే కార్మిక రంగంలో నిర్వహించవలసిన కర్తవ్యాల విషయంలో లెనిన్ విధానాన్ని తీవ్రంగా, బహిరంగంగా వ్యతిరేకించాడు. యూనియన్లను, ఫేక్టరీలలోనూ, షాపులలోనూ, పరిశ్రమలలోనూ కార్మికులకు ప్రాతినిధ్యం వహించే సంస్థలుగా కాకుండా, దేశానికి అనుబంధంగా ఉండే పరిపాలనా విభాగాలుగా, ప్రభుత్వ విధులను నిర్వర్తించేవిగా ఉండాలని భావించాడు. వాటిని నిర్మించాలని ఆతను కోరుకున్నాడు. ఐక్యత ఒక జీవన్మరణ సమస్య అయిన కాలంలో, కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలు విచ్ఛిన్నమయ్యే విధంగా, లెనిన్ కు వ్యతిరేకంగా ఒక చిన్న ముఠాను అతను ఏర్పాటు చేశాడు. లెనిన్ ఈ ముఠాతత్వాన్ని విచ్ఛిన్నకర చర్య అని వర్ణించాడు. లెనిన్ ఈ విధంగా చెప్పాడు,

"'.....'నూతన కర్తవ్యాలు, పద్ధతులు' చాలా మంచివని ట్రాట్స్కీ చెప్పినా, వాస్తవానికి వాటన్నిటినీ తప్పుగానే ఎత్తిచూపాడు,...కేవలం అటువంటి విధానం ద్వారానే ట్రాట్స్కీ తనకు తానే హాని కలిగించుకునే వాడు. పార్టీకి, కార్మికోద్యమానికి,

లక్షలాది మంది కార్మిక యూనియన్ సభ్యులకు శిక్షణకూ, రిపబ్లిక్ కూ హాని కలిగించేవాడు." (V. I. Lenin, Collected Works, Vol. XXVI, Russian edition, p. 116.)

ట్రాట్స్కీ ఓడిపోయాడు. అతని ప్రణాళిక విజయవంతమై ఉంటే, అది మొత్తం సోవియట్ వ్యవస్థనే నాశనం చేసి ఉండేది.

1923లో అతను తిరిగి బోల్షివిక్ పార్టీని వ్యతిరేకించడం ప్రారంభించాడు. ఈ సారి ఈ వ్యతిరేకత ఏదో ఒక సమస్య పైన కాదు. మొత్తం పార్టీ, దాని నిర్మాణం, దాని కార్యకలాపాలు - తనకు చికాకు కలిగించే మొత్తం పార్టీ పంథాను అతను వ్యతిరేకించసాగాడు. మొదట ప్రముఖ నాయకులలో అతను ఒంటరిగానే ఉన్నాడు. 1917 నవంబరులో తిరుగుబాటునూ, బోల్షివిక్ పార్టీ అధికారాన్ని స్వాధీనం చేసుకోవడాన్నీ వ్యతిరేకించి, లెనిన్ "సమ్మెవిచ్ఛిన్నకులు" అనే ముద్రవేసిన, జినోవీవ్, కామినేవ్ లు 1926లో అతనితో చేతులు కలిపారు. ట్రాట్స్కీతో అనేక విషయాలలో వారికి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి, కానీ వారు అతని నాయకత్వాన్నీ, బోల్షివిక్కుల పట్ల అతని వ్యతిరేకతలోని మౌలిక అంశాలను అంగీకరించారు.

తమ అభిప్రాయాలను పార్టీ శ్రేణులకు అందించడానికి ట్రాట్స్కీకి, అతని సహచరులకూ "అవకాశం ఇవ్వలేదు" అనే కట్టుకధ ఒకటి ప్రచారంలో ఉంది. వాస్తవానికి పార్టీ నాయకత్వానికీ, ప్రతిపక్షానికీ మధ్య 1924 నుండి 1927 వరకు చర్చ కొనసాగింది. కేంద్ర సంస్థల అనేక సమావేశాలలో, అసంఖ్యాకమైన పార్టీ దిగువ సంస్థల సమావేశాలలో, ప్రతి పక్ష కార్యక్రమాన్ని తీవ్రంగా విమర్శించడం జరిగింది. ఈ అంశాలకు సంబంధించిన అనేక డజన్ల పుస్తకాలూ, వేల కరపత్రాలు ప్రచురించబడి విస్తారంగా పంచబడ్డాయి. పార్టీ సభ్యుల సహనం కోల్పోయే వరకూ తమ వాదనను ప్రతిపక్షం వినిపించింది.

చర్చ ముగిసే సరికి ఈ నాయకులూ, వారి సహచరుల బృందం, పూర్తిగా అపకీర్తి పాలయ్యారు, కుట్ర దారులుగా వెల్లడయ్యారు. పార్టీ సభ్యులు, కార్మికులు వారిని అసహ్యించుకున్నారు.

అటువంటి ఆరోపణ తీవ్రతను మేము గుర్తిస్తున్నాం. పార్టీ సభ్యత్వంలో అత్యధికులు వాళ్ళతో విభేదిస్తూ పార్టీకి లొంగి ఉండాలని కోరుతుండగా, బాధ్యతగల పార్టీ సభ్యులుగా అగుపించే కొంతమంది పార్టీలో ఒక చిన్న ముఠాను సృష్టించే కార్యకలాపాలను మరే విధంగా చెప్పగలం? ఈ ముఠాకు స్వంత ముఠా క్రమశిక్షణ, ముఠా కేంద్రాలు ఉన్నాయి. పార్టీ వ్యతిరేక పధకాలు అమలు జరపడానికి పార్టీయేతర పెట్టీ బూర్జువా సమూహాలతో ఈ ముఠా పొత్తు పెట్టుకుంది. పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా రహస్య సాహిత్యాన్ని ప్రచురించి ప్రజలలో పంపిణీ చేస్తూ, విప్లవానికి వెన్నెముక అయిన కమ్యూనిస్టు పార్టీని విచ్ఛిన్నం చేయడానికి తొలి అడుగులు వేసింది.

1927 లో ట్రాట్స్కీ, జినోవీవ్ లు సరిగ్గా ఇదే చేశారు. పార్టీ ఈ ముఠాను పార్టీ నుంచి వెళ్ళగొట్టాల్సి వచ్చింది. 1927కు ముందు చేసినట్లుగానే, వారిలో కొంతమంది, తమ విధ్వంసక కార్యకలాపాలను తిరిగి కొనసాగించే ఉద్దేశంతో, తమ తప్పులను అంగీకరించారు. ట్రాట్స్కీ తన తప్పును అంగీకరించలేదు. అతనిని రాజధానిని వదిలి వెళ్ళమని ఆదేశించి, మధ్య ఆసియాకు చెందిన ఆల్మా ఆటా నగరానికి బదిలీ చేశారు. ఆ తరువాత అతనిని దేశం నుండి బహిష్కరించారు. అప్పటి నుండి అతను సోవియట్ యూనియన్ కు వ్యతిరేకంగా ప్రపంచ బూర్జువాకు మందుగుండు సరఫరా చేస్తూనే ఉన్నాడు. అతని మందుగుండు తడిది. అతని ఫిరంగి హానికలిగించకుండా గర్జిస్తుంది. కానీ అతన్ని వాస్తవమైన సమాచారానికి మూలంగా చూస్తున్నట్లు బూర్జువా వర్గం నటిస్తుంది. విప్లవ నాయకునిగా తనకున్న పలుకుబడి ఆధారంగా అతను తన ప్రతీఘాత

విప్లవ కార్యక్రమాలను నిర్వహిస్తాడు. తన అసంఖ్యాక రచనల ద్వారా లెనిన్ కాక తానే విప్లవానికి సారధ్యం వహించినట్లు మందమతులను నమ్మించడానికి ప్రయత్నిస్తాడు.

క్లుప్తంగా ట్రాట్స్కీ రాజకీయ జీవితం అటువంటిదే, అతనెప్పుడైనా బోల్షివిక్ గా ఉన్నాడా? ముప్పైమూడు సంవత్సరాల కాలంలో కేవలం ఆరు సంవత్సరాలు మాత్రమే అతను బోల్షివిక్కులతో సంబంధాలు కలిగి ఉన్నాడు. ఆ సమయంలో కూడా అతనికి వారితో తీవ్రమైన విభేదాలు చాలా ఉన్నాయి. వాస్తవానికి అతను హృదయపూర్వకంగా ఆమోదించిన లెనినిస్టు విధానం ఒక్కటి కూడా లేదు. అతను ఎప్పుడూ బోల్షివిక్ పార్టీలో అంతర్భాగంగా మారలేదు. పోలిట్ బ్యూరో సభ్యుడుగా ఉన్నప్పుడు కూడా అతను బోల్షివిక్ పార్టీలో పరాయి వ్యక్తిగానే ఉన్నాడు.

తమ పార్టీలో నిజాయితీగా, హృదయపూర్వకంగా విలీనం అయిన వారి బోల్షివిక్ యేతర గత జీవితం గురించి బోల్షివిక్కులు ప్రస్తావించనక్కర్లేదు. . మేము ట్రాట్స్కీ గతాన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నామంటే, అది ఎప్పుడూ అతని గతంగా మారలేదు. అతని గతం ఇప్పటికీ అతని వర్తమానమే. ఇరవై సంవత్సరాల క్రితం లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీని ఎంత తీవ్రంగా వ్యతిరేకించాడో అంతే తీవ్రంగ్ స్టాలిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీని అతను ఇప్పుడు వ్యతిరేకిస్తున్నాడు. ఏ కారణాల వలన లెనిన్ పై తీవ్ర అపవాదులు వేశాడో అవే కారణాలతో స్టాలిన్ పై అతను దుర్మార్గంగా అపవాదులు వేస్తున్నాడు.

"ఇంత ద్వేష భారాన్ని(బోల్షివిక్కుల పట్ల ద్వేషాన్ని) తన వీపుపైన మోస్తున్న కామ్రేడ్ ట్రాట్స్కీ అక్టోబర్ ఉద్యమంలో బోల్షివిక్ శ్రేణులలోకి రావడం ఎలా జరిగింది?(అని స్టాలిన్ అన్నాడు) కామ్రేడ్ ట్రాట్స్కీ తన ద్వేష భారాన్ని విడిచిపెట్టిన కారణంగా (నిజంగానే విడిచిపెట్టిన కారణంగా) (కాని) ఆ ద్వేషాన్ని తన అల్మారాలో దాచి ఉంచినందువలనే,

*అతను బోల్షివిక్ శ్రేణులలో చేరడం సాధ్యమయింది. ట్రాట్ స్కీ ఇలా తన ద్వేషాన్ని కప్పి ఉంచకపోతే అతనితో ముఖ్యమైన సహకారం సాధ్యం అయ్యేది కాదు...*

*ఇటువంటి పరిస్థితిలో [తన సిద్ధాంతాన్ని ఆచరించడం అసాధ్యమని అనుభవం ద్వారా తెలిసిన తరువాత], తన వెనుక ముఖ్యమైన సమూహం ఏదీ లేని, తన బలగం లేని ఏక వ్యక్తి రాజకీయ సంస్థగా బోల్షివిక్కుల వద్దకు వచ్చిన కామ్రేడ్ ట్రాట్స్కీ, తన భారాన్ని అల్మారాలో దాచిపెట్టి బోల్షివిక్కులను అనుసరించడం తప్ప మరేమైనా చేయగలడా? అతను ఏమీ చేయలేడు.*

*"... వాస్తవం ఏమిటంటే అక్టోబరు ఉద్యమ సందర్భంలో అల్మైరాలో దాచిపెట్టిన ట్రాట్స్కీయిజం యొక్క పాత భారాన్ని, దానికి మార్కెట్ ను కనుగొనగలమనే ఆశతో మరోసారి ఇప్పుడు వెలుగులోకి లాక్కువచ్చారు." (Joseph Stalin, The October Revolution, pp. 89-90.)*

*ట్రాట్స్కీ తన "అసహ్యకరమైన భారాన్ని " తన అల్మైరాలో దాచి పెట్టినప్పుడు అతను ఏకవ్యక్తి సంస్థ. అతను దానిని మరలా బయటకు తీసినప్పుడు తన వెనుక మహత్తర సైన్యం ఉందని ఆతను నమ్మాడు. అతను పొరపడ్డాడు. కమ్యూనిస్టు పార్టీ సాధారణ సభ్యులు, నిజాయితీపరుడైన ప్రతి సోవియట్ కార్మికుడు, అసహ్యకరమైన ఈ భారాన్ని మోస్తున్న వ్యక్తిని అనుసరించడానికి తిరస్కరించారు. ఇప్పుడు అతను ప్రపంచ స్థాయిలో అటువంటి సైన్యాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నాడు.*

*******************